## క్లుప్తంగా

### జూదరుల అరెస్ట్

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న ముగ్గురు జూదరుల బుధవారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిందితుల నుంచి 10,200 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

### సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా తిరుపతిరావు



గజపతినగరం రూరల్: స్థానిక సివిల్ జడ్జి కోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా చప్ప తిరుపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ సభ్యులు తిరుపతిరావును బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వహిస్తానన్నారు.

### స్వమిత్వ సర్వే పరిశీలన



స్వమిత్వ సర్వేపై ఆరా తీస్తున్న డీపీఓ మల్లికార్జునరావు

జామి: మండలంలోని యాతపాలెంలో బుధవారం అధికారులు చేపట్టిన స్వమిత్వ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు, ఖాళీ స్థలాలకు హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఉమా, పంచాయతీ కార్యదర్శి వాసంతి, సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న అభిమానులు

చీపురుపల్లి: మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా పట్టణంలోని కస్పావీధిలో గల వైశ్యవర్తక సంఘ భవనంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. 40 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీజీ శ్రీనివాసరావు, కింతలి మధు, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామసభలు



సోంపురం గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కవిత

వేపాడ: మండలంలోని సోంపురం, పెదకృష్ణరాజపురం గ్రామాల్లో తోటపల్లి బ్యారేజ్ యూనిట్ -3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్ కవిత నేతృత్వంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోంపురం రెవెన్యూలో 23 ఎకరాలకు సంబంధించి 30 మంది రైతులను.. పెదకృష్ణంరాజపురం రెవెన్యూలో 32 ఎకరాలకు సంబంధించి 72 మంది రైతులను గుర్తించినట్లు చెప్పారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ, ధర పెంచకపోతే భూములు ఇవ్వలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ కె.కృష్ణారావు, ఉప తహసీల్దార్లు పి.లావణ్య, శ్రీనివాసరావు, సర్వేయర్ తవిటయ్య, మండల తహసీల్దార్ జె.రాములమ్మ, వీఆర్‌ఓలు అప్పలరామ్, వీర్రాజు సర్పంచ్‌లు మురిపిండి గంగరాజు, ముమ్మలూరి జగ్గుబాబు, రైతులు పాల్గొన్నారు.

### డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి అర్హత కలిగిన విద్యార్థులు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాలలో బీఎస్సీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జువాలజీ కోర్సులతో పాటు బీకాం కంప్యూటర్స్, బీఏ పొలిటికల్ సైన్స్ కోర్సులున్నాయన్నారు. అలాగే పీజీకి సంబంధించి ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### అవసరమైన ఎరువులే ఇవ్వాలి..

గజపతినగరం: రైతులకు అవసరమైన ఎరువులు మాత్రమే ఇవ్వాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఎ.నిర్మలజ్యోతి సూచించారు. మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవసరం లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రెండో విడతలో సాధారణ యూరియాకు బదులు నానో యూరియా వేయాలని అక్కడకు వచ్చిన రైతులకు సూచించారు. కార్యక్రమంలో పి.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు చుక్కానీ..

- ఎస్.కోటలో అన్ని సౌకర్యాలతో అలరారుతున్న గ్రంథాలయం
- ఉద్యోగార్థుల పట్ల కల్పతరువు
- దాతల ఔదార్యమే బలం

శృంగవరపుకోట:

ఉద్యోగార్థుల పాలిట కల్పతరువులా.. కొలువుల మాగాణిలా.. వారి జీవితాలకు చుక్కానిలా నిలుస్తోంది ఎస్.కోటలోని శాఖా గ్రంథాలయం. యువత భవితను తీర్చిదిద్దే కొలువుల నిలయం ఈ లైబ్రరీ. దాతల ఔదార్యంతో అసౌకర్యాలను అధిగమించి, ఉద్యోగార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. 2003లో లైబ్రేరియన్‌గా డి.శ్రీధర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత 'కోట'లో గ్రంథాలయం తీరు మారింది. ఉద్యోగార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు వరమైంది. లైబ్రేరియన్ పాఠకుల కోసం దాతల నుంచి విరాళాలు సేకరించి అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చారు. గతంలో రోజువారీ పాఠకుల సంఖ్య 40 నుంచి 50 వరకు ఉండగా నేడు ఆ సంఖ్య సుమారు 150 మందికి చేరుకుంది. గ్రంథాలయం నిండా గ్రంథాలు, నవలలు, కథల పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, కుర్చీలు, టేబుల్స్‌తో కనువిందు చేస్తోంది.



ఎస్.కోట శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు చదువుతున్న యువత

#### ● యువతకు వరం ..

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని పుస్తకాలు, వసతులు అందుబాటులో ఉన్నాయి. దాతలిచ్చిన సుమారు లక్ష రూపాయల విరాళాలతో పోటీ పరీక్షల పుస్తకాలు, రీడింగ్ కుర్చీలు, వాటర్ ఫిల్టర్, రీడింగ్ ప్లాంక్‌లు, సీలింగ్ ఫ్యాన్లు కొనుగోలు చేశారు. అలాగే ఉచితంగా వైఫై కనెక్షన్ ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో యువతులు సైతం నిర్భయంగా గ్రంథాలయానికి వస్తున్నారున. గ్రంథాలయ పనివేళలు ఉదయం 8 గంటల నుంచి 11 వరకు.. సాయంత్రం మూడు నుంచి ఆరు గంటల వరకే అయినా, డివిజన్ కేంద్రంలోని లైబ్రరీ మాత్రం రాత్రి 11 వరకు కొనసాగుతుండడం విశేషం.



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

#### ● లైబ్రరీని నమ్మారు - కొలువులు కొట్టారు..

స్థానిక లైబ్రరీలో టీచర్, బ్యాంక్స్, రైల్వే, గ్రూప్ - 1, 2, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, కోర్టు క్లర్క్స్, ఆర్‌ఆర్‌బీ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. లైబ్రరీనే నమ్ముకున్న ఐదుగురు యువకులు ఇటీవల పోలీస్ కొలువులు సాధించారు. గతంలో రేవతి గ్రేడ్-2 ఆఫీసర్‌గా, మోపాడ మోహన్ రైల్వే కొలువు సాధించారు. పలువురు ఇతర ప్రాంతాల విద్యార్థులు సైతం ఇక్కడ చదువుకుని పోటీ పరీక్షల్లో అర్హత సాధించారు. స్థానిక శాఖా గ్రంథాలయానికి ప్రధాన రహదారిలో సొంత భవనం ఉన్నా శిథిలావస్థకు చేరుకోవడంతో 2023 నుంచి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. లైబ్రరీకి శాశ్వత వసతి కల్పించాలన్న ప్రతిపాదన ఏళ్లు గడుస్తున్నా పాలకుల చెవికి చేరలేదు. జిల్లా కేంద్రం తర్వాత పెద్ద ఎడ్యుకేషన్ హబ్ అయిన ఎస్.కోటలోని గ్రంథాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



దాతల విరాళాలతో ఏర్పాటు చేసిన కుర్చీలు, రీడింగ్ ప్లాంక్‌లు

### కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా..



నేను పోటీ పరీక్షలకు సిద్ధమవడంలో ఎస్.కోట లైబ్రరీ చాలా సాయం చేసింది. నేను చాలా చోట్ల ప్రిపేర్ అయ్యా. కాని ఎస్.కోట లైబ్రరీ బాగా సెట్ అయింది. ఇక్కడి లైబ్రేరియన్ బాగా హెల్ప్ చేస్తారు. అడిగిన వెంటనే అప్‌డేట్ బుక్స్ ఇవ్వడంతో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– నౌదాసరి సన్యాసిరావు, కానిస్టేబుల్, సీతంపేట

### ఒక వరమే..



చదువుకోవడానికి అన్ని అవకాశాలు కల్పిస్తున్న లైబ్రరీ మాస్టర్‌కు ఋణపడి ఉండాలి. బుక్స్, వైఫై, కంప్యూటర్, ఫ్యాన్లు, మినరల్ వాటర్, పాత మెటీరియల్‌తో పాటు అప్‌డేట్ బుక్స్ ఇస్తున్నారు. నాలా మారుమూల గ్రామాల యువతకు ఎస్.కోట లైబ్రరీ ఒక వరమే.

– పాతబోయిన వెంకటశివాజీ, కానిస్టేబుల్, కొండగంగుబూడి

### కొలువు సాధించా..



ఎస్.కోట లైబ్రరీలో ప్రశాంతంగా కూర్చుని చదువుకునే మంచి వాతావరణం కల్పించారు. లైబ్రేరియన్ శ్రీధర్ గారి ప్రోత్సాహం, సహకారంతో లైబ్రరీనే నమ్ముకుని పోటీ పరీక్షలకు సన్నద్ధమై కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ఎస్.కోట లైబ్రరీ యువతకు ఒక మంచి మార్గదర్శి.

– వసంత గణేష్, ఎస్.కోట

### యువతకు ఉపయోగపడాలని..



ఇక్కడ అంతా పేద కుటుంబాల పిల్లలే. కష్టపడే తత్వం ఉన్నా, ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్ ఏదైనా వెంటనే ఏర్పాటు చేస్తున్నాం. దాతల సహకారంతోనే అన్ని వసతులు కల్పించాం. శాశ్వత భవనం ఏర్పాటైతే మరింత మందికి ఉపయోగపడుతుంది.

– డి.శ్రీధర్, లైబ్రేరియన్, ఎస్.కోట

### కొన్ని నెలలుగా..



కొన్ని నెలలుగా ఈ లైబ్రరీకి వస్తున్నా. ఉదయం 8 గంటలకు వచ్చి రాత్రి 11 వరకు ఉంటున్నాం. పొరుగు గ్రామాల యువత చాలామంది క్యారేజీలతో వచ్చి, ఇక్కడే భోంచేసి రోజంతా లైబ్రరీలోనే గడుపుతున్నారు. లైబ్రేరియన్ శ్రీధర్ మాకు ఏ నోటిఫికేషన్ వచ్చినా, అందుకు తగిన మెటీరియల్ వెంటనే అందుబాటులో ఉంచుతున్నారు. లైబ్రరీ సాయంతో సర్కారు కొలువు సాధించాను.

– లెక్కల గణేష్, కానిస్టేబుల్, కాపుసోంపురం

## ప్రజల కష్టాలపై పాలకులకు శ్రద్ధ లేదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం

చీపురుపల్లి: ప్రజల కష్టాలు చూసి ఆదుకోవాల్సిన పాలకులు ఆ దిశగా ఆలోచించడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిల అనంతరం అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేధింపులు, అక్రమ కేసులు, లంచాల వసూళ్లపై కూటమి నాయకులకు ఉన్న శ్రద్ధ పాలనపై లేదని ఎద్దేవా చేశారు. ఎంతోమంది అర్హులకు పింఛన్లు నిలిచిపోతున్నా.. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎంతో అవసరమైన యూరియా అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు సిద్ధం చేశామన్నారు. తోటపల్లి నీటిని కాలువల ద్వారా తీసుకురావాలన్న ఆలోచనల ఇంతవరకు పాలకులకు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

**సుమారు 1200 పింఛన్ల నిలిపివేత..**

నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 1200 మంది పింఛన్లను వివిధ కారణాలతో నిలిపివేశారన్నారు. దీంతో ఇంతవరకు పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు లబోదిబోమంటున్నారని తెలిపారు. చీపురుపల్లి మండలంలో 347 పింఛన్లు.. గరివిడి మండలంలో 300.. గుర్లలో 310.. మెరకముడిదాం మండలంలో 300 మంది పింఛన్లు నిలిపివేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోగా.. ఉన్నవాటిని నిలిపివేయడం తగదన్నారు.



తొలగించిన వికలాంగ పింఛన్ల జాబితా చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం

**ఒక్క అడుగు ముందుకు పడలేదు..?**

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదన్నర అవుతున్నా స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో ఏరియా ఆస్పత్రి వంద పడకల ఆస్పత్రిగా మారిందని, అలాగే రూ. 28 కోట్ల నిధులు కూడా మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో ఆస్పత్రిని ఎందుకు అభివృద్ధి చేయడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధికి కూటమి నాయకులు కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ వలంటీర్ విభాగం అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు ఏవీ..?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: ఖరీఫ్ సీజన్‌లో ఎన్నో కష్టాలు పడి పంటలు సాగుచేస్తున్న రైతులకు ఎరువులు అందించకపోవడంపై పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్. అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లను రద్దు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన చర్చలో వ్యవసాయాధికారి తమ శాఖ ప్రగతిని వివరిస్తుండగా ఇప్పటివరకు ఎన్ని టన్నుల ఎరువులు అందజేసారంటూ రేగ, చందులూరు ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. అలాగే చందులూరులో ఉపాధి పనుల నిర్వహణపై పంచాయతీరాజ్ అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఎంపీడీఓ అప్పారావు, పీఆర్ జేఈ వీరలక్ష్మిని నిలదీశారు.ఈ సమయంలో అధికారులు, సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కలుగజేసుకుని సర్దిచెప్పారు. కార్యక్రమంలో అధికారులు, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎంపీడీఓను నిలదీస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు యడ్ల కిశోర్

## ప్రశంసలు

వేపాడ: వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎస్. సుదర్శన్‌తో పాటు ఏఎస్సైనాగేశ్వరరావు, ఇద్దరు కానిస్టేబుళ్లు కనకరాజు, సంతోష్‌లను ఎస్పీ వకుల్‌జిందల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేసి బుధవారం అభినందించారు. ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుడిని గుర్తించడంతో పాటు ప్రమాదానికి కారణమైన నిందితుడిని త్వరగా అదుపులోకి తీసుకున్నందుకు గాను సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలియజేశారు.



ఎస్సై సుదర్శన్, ఏఎస్సై నాగేశ్వరరావులను అభినందిస్తున్న ఎస్పీ వకుల్‌జిందల్

### జాగ్రత్తలు తప్పనిసరి

చీపురుపల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉద్యానవన పంటలకు సంబంధించి రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి ఎం.అనూష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొప్పాయి, అరటితో పాటు కూరగాయల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పంట పొలాల్లో నిలిచి ఉన్న నీటిని తక్షణమే బయటకు పంపించాలన్నారు. అధిక వర్షాలకు బొప్పాయి మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లు వంటి లక్షణాలు కనిపిస్తే రెడోమిల్ 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి మొక్క మొదలు వద్ద పోయాలని సూచించారు. బొప్పాయిలో ఎక్కువ మొక్కలు పక్వానికి వస్తే వాటికి వ్యాధులు రాకుండా హెక్సాకొనజోల్ 2 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

### పింఛన్లు తొలగించడం దారుణం



పొట్నూరు సన్యాసినాయుడు

గుర్ల: అనర్హత బూచిగా చూపి దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి నాయకులు పెన్షన్‌దారుల పొట్ట కొడుతున్నారన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే పోరాటం తప్పదన్నారు.

### కోర్టు ఆదేశాలు పట్టించుకోరా..!

శృంగవరపుకోట: అధికారులు కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోరా అని జిందాల్ నిర్వాసితులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. శాంతియుత నిరసనలకు అనుమతులు ఇవ్వకుండా రకరకాల కేసులు పెట్టి ఎస్.కోట పోలీసులు తమను భయపెడుతున్నారన్నారు. దీంతో హైకోర్టులో పిటిషన్ వేయగా.. పిటిషనర్లు ముందుగా పోలీసులకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి చట్టబద్ధంగా అనుమతులివ్వాలని ఆదేశించిందన్నారు. అయితే ఇప్పటివరకు పదుల సంఖ్యలో స్థానిక సీఐకి దరఖాస్తులు ఇస్తే ఒక్కదానికి కూడా అనుమతి ఇవ్వలేదన్నారు. ఇది కోర్టు ధిక్కారం కాదా అని ప్రశ్నించారు. ప్రజల హక్కులను కాలరాయడం తగదని చెబుతూ బొడ్డవరలో నిరసన వ్యక్తం చేశారు.

### ఆర్థిక సాయం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలో గల ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో సైన్స్ ల్యాబ్ పరికరాల ఏర్పాటుకు ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు లక్ష రూపాయల చెక్కు బుధవారం అందజేశారు. ల్యాబ్‌లో పరికరాలు లేవనే విషయాన్ని సర్పంచ్ ప్రతినిధి పచ్చిపల్లి కుమార్ గత నెలలో బొత్స సందీప్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### దెప్పూరులో ఎమ్మెల్సీ పర్యటన

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలోని దెప్పూరు గ్రామంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం పర్యటించారు. రైతుల అనుభవంలో ఉన్న భూములన్నీ జిందాల్ పేరిట రిజిస్ట్రేషన్ కావడంతో భూములు అప్పగించాలని రెవెన్యూ అధికారులు చెప్పడంతో గ్రామంలో అలజడి ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్సీ రఘురాజు గ్రామంలో పర్యటించి, గ్రామస్తులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.

### 359 పింఛన్లు రద్దు

వేపాడ: మండలంలోని 18 సచివాలయాల పరిధిలో 359 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దయినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 70 మందిని వృద్ధాప్య పింఛన్‌కు మార్పు చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన 289 మంది దివ్యాంగులు ఆధార్, పాత సదరం, కొత్త సదరం సర్టిఫికెట్లతో గ్రామ సచివాయలంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద మరోసారి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్నట్లయితే పింఛన్లను పునరుద్ధరిస్తామన్నారు.

### నీట్ పీజీ విభాగంలో రాణించిన చందనరెడ్డి



చీపురుపల్లి: నీట్ పీజీ విభాగంలో పట్టణానికి చెందిన చందనరెడ్డి చక్కని ప్రతిభ కనబరిచింది. పట్టణానికి చెందిన చందనరెడ్డి తాజాగా విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 9,597వ ర్యాంక్ సాధించి వైద్య విభాగంలో పీజీ చదివేందుకు అర్హత సాధించింది. దీంతో ఆమెను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

### వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. కృష్ణారాయుడుపేట ఎంపీయూపీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు.

## చీకట్లోనే వైద్యసేవలు..

గజపతినగరం రూరల్: ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం చేసి చూపించలేకపోతోంది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతే అంధకారంలోనే రోగులకు వైద్యసేవలు అందించారు. ఉదయం పది గంటలకే విద్యుత్ సరఫరా లేకపోవడంతో అటు వైద్యులు, ఇటు రోగులు ఇబ్బంది పడ్డారు. ఆయుష్ విభాగం సిబ్బంది సెల్‌ఫోన్ల వెలుగులో వైద్యసేవలు అందించారు. అలాగే చెవి, ముక్కు, గొంతు విభాగానికి చెందిన వైద్యురాలు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా వస్తే వైద్యసేవలు అందిస్తామని చెప్పడం విశేషం. ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నా వినియోగించడం లేదనే విమర్శలున్నాయి. ఇదే విషయాన్ని డీసీహెచ్‌ఓ పద్మశ్రీవాణి వద్ద ప్రస్తావించగా.. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే జనరేటర్‌ను వినియోగించుకోవాల్సి ఉందన్నారు.



ఆయుష్ విభాగంలో విద్యుత్ లేకపోవడంతో చీకట్లో ఉన్న సిబ్బంది

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ..



భారత కమ్యూనిస్టు పార్టీ ఒంగోలులో త్వరలో నిర్వహించనున్న 28వ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక సీపీఐ కార్యాలయం ఆవరణలో నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖండిపల్లి భీముడు, తదితరులు పాల్గొన్నారు.

- శృంగవరపుకోట

## అటు ధిక్కారం.. ఇటు స్వీకారం



పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రమాణం చేసున్న మేడపురెడ్డి శ్రీను

- కేఎం పురం పీఏసీఎస్ కొత్త కార్యవర్గం కూర్పుపై నిరసనలు

శంగవరపుకోట:

మండలంలోని కృష్ణమహంతిపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో కొత్త కార్యవర్గం కూర్పు అధికార కూటమిలో కొత్త చిచ్చు రేపింది. కృష్ణమహంతిపురం పీఏసీఎస్ భవనంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పీఏఎస్ అధ్యక్షుడిగా మేడపురెడ్డి శ్రీను, డైరెక్టర్‌గా ఇందుకూరి శ్రీనివాసరాజు ప్రమాణం చేశారు. ఇదిలా ఉంటే ఇదే సమయంలో కిల్తపాలెం పంచాయతీ గవరపాలెం గ్రామానికి చెందిన పెంటకోట రమణబాబును కృష్ణమహంతిపురం పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఎంపిక చేస్తూ ప్రమాణ స్వీకారానికి రావాలని కూటమి పెద్దలు ఆహ్వానించారు. దీంతో రమణబాబు, తదితరులు వచ్చేసరికి శ్రీను ప్రమాణస్వీకారం జరుగుతుండడంతో కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా రమణబాబు మాట్లాడుతూ.. సొసైటీలో 750 మంది సభ్యులుంటే అత్యధికంగా రైతులున్న కిల్తంపాలెం, బొడ్డవర, పెదఖండేపల్లి గ్రామాల నుంచి కాకుండా 20 మంది సభ్యులున్న గ్రామానికి చెందిన వ్యక్తిని అధ్యక్షుడిగా ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. పార్టీలో కష్టపడిన వారికి గౌరవం దక్కడం లేదని ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ యాళ్ల రమణ, ఎమ్పీటీసీ సభ్యుడు బోదల దేముడు, మండల ప్రచార కార్యదర్శి ఐ.శ్రీనురాజు, ఆడారి సూరిఅప్పారావు, తదితరులు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు.



కార్యవర్గాన్ని వ్యతిరేకిస్తున్న టీడీపీ నాయకుడు రమణబాబు వర్గం